క్లుప్తంగా

నియామకం


చేపూరి చిరంజీవి

స్టేషన్‌ఘన్‌పూర్: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు పార్లమెంట్ పరిధిలో ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా మండలంలోని ఛాగల్లు గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ చేపూరి చిరంజీవి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఘన్‌పూర్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అక్కడ ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న కొప్పుల రాజు గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ఆత్మకూరు ఇన్‌చార్జ్‌గా నియమించిన ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ప్రీతమ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇందిర తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ వరంగల్ పార్లమెంట్ అదనపు ఇన్‌చార్జ్‌గా గణేష్‌గౌడ్



పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓబీసీ సెల్ అదనపు ఇన్‌చార్జ్‌గా రాష్ట్ర ఓబీసీ సెల్ కోఆర్డినేటర్, మహబూబాబాద్ ఓబీసీ సెల్ ఇన్‌చార్జి పులి గణేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా గణేష్ గౌడ్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఓబీసీసెల్ రాష్ట్ర చైర్మ న్ నూతి శ్రీకాంత్‌గౌడ్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి,కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హ నుమండ్ల ఝాన్సీరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల బీజేపీ జఫర్‌గఢ్ ఇన్‌చార్జ్‌గా కృష్ణగౌడ్




స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ జఫర్‌గఢ్ మండల ఇన్‌చార్జ్‌గా ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి గట్టు కృష్ణ గౌడ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గట్టు కృష్ణ మంగళవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన పథకాలను బూత్‌స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ గెలుపు కోసం శాయశక్తులా పనిచేస్తానన్నారు.

బీజేపీ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం


పాలకుర్తి: వరంగల్ పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పాలకుర్తి నియోజకవర్గ మండలాల ఇన్‌చార్జ్‌లను మంగళవారం నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి మంగళవారం తెలిపారు. పార్టీ పాలకుర్తి మండల ఇన్‌చార్జ్‌గా చింత సృజన్, దేవరుప్పుల (దొంగరి మహేందర్), కొడకండ్ల(దుబ్బ రాజశేఖర్), తొర్రూరుకు (రంగు రాములు), తొర్రూరు రూరల్(కర్ర శ్రీనివాస్ రెడ్డి), పెద్ద వంగర(కొలువుల శంకర్), రాయపర్తి మండల ఇన్‌చార్జ్‌గా కమ్మగాని శ్రీకాంత్‌లను నియమించినట్లుగా చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ఇన్‌చార్జ్‌లు బాధ్యత వహించాలని అన్నారు. ఎంపీ అభ్యర్థిగా ఆరూరి రమేశ్‌ను భారీ ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సొడ రమేష్, అసెంబ్లీ కన్వీనర్‌గా పూసాల శ్రీమాన్, జాయింట్ కన్వీనర్‌గా సుంకరనేని కోటేశ్వర్ పాల్గొన్నారు.

ఫ్రీజర్‌ల అందజేత



స్టేషన్‌ఘన్‌పూర్: జంటపట్టణాలైన స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి గ్రామ పంచాయతీలకు ఘన్‌పూర్, శివునిపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఫ్రీజర్‌లను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ డీఎస్ వెంకన్న మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈఓలు సత్యనారాయణ, శ్రీకాంత్, క్లబ్ బాధ్యులు యువాన్‌జాన్, సురేందర్, ఆమంచ మధుసూధన్, రంగాచారి, ఆర్డీఓ చారి, దస్తగిరి, వీటీ శ్రీనివాస్ ఉన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



బచ్చన్నపేట: తాగునీటి సమస్య రాకుండా అధికారులు చూడాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. కట్కూర్‌లో నా లుగు రోజుల క్రితం బోరుమోటారు పనిచేయక పోవడంతో స్థానికులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన సంబంధిత అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం నూతన బోరుమోటారును అమర్చారు.

ఆటపాటలతో విద్యాబోధన


రఘునాథపల్లి: మాట్లాడుతున్న సరస్వతి


స్టేషన్‌ఘన్‌పూర్: స్కూల్‌డేలో పిల్లలు, తల్లులు


జఫర్‌గఢ్‌లో..

రఘునాథపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణంలో ఆట పాటలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. మంగళవారం మండలంలోని కోమల్ల అంగన్‌వాడీలో స్కూల్‌డే సందర్భంగా చిన్నారులతో ప్రదర్శన చేయించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో మొదటి ఆరేళ్లు అంగన్‌వాడీ కేంద్రంలో పొందే విద్య ఎంతో విలువైందన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు తమ పిల్లల అభివృద్ధి కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లుభాయాలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలోని నాల్గో అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం అంగన్‌వాడీ స్కూల్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య హాజరై మాట్లాడారు. అనంతరం పిల్లలకు అసెస్‌మెంట్ కార్డులను అందించారు. అంగన్‌వాడీ టీచర్ చల్ల మంజుల, అంగన్‌వాడీ పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

జఫర్‌గఢ్: అగన్‌వాడీల సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలం కేంద్రంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో, కోయినా చలం అంగన్‌వాడీలో స్కూల్ డేను నిర్వహించారు. టీచర్లు జగదీశ్వరీ, ,ఉపేంద్ర, ఆయాలు పాల్గొన్నారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన 'నాగపురి'


సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న కిరణ్ కుమార్‌గౌడ్

జనగామ: మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్ కుమారుడు, ఇటీవల బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ హైదరాబాద్‌లో సీఎం కిరణ్ కుమార్ రెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యములో ముఖ్య మంత్రి పిలుపు మేరకు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం కిరణ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి గెలుపునకు కృషి చేస్తానన్నారు. నియోజక వర్గంలోని ప్రతీ ఒక్కరిని కలుపుకుపోతూ ఎంపీ అభ్యర్థికి భారీ మెజార్టీ వచ్చేలా ముందుకు సాగుతామన్నారు. ఆయన వెంట నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్, మాజీ ఎమ్మెల్సీ రాజేశం, కేకే మహేందర్ రెడ్డి ఉన్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటా ప్రచారం


జనగామ రూరల్: పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్: బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి నర్సయ్య గౌడ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హరిశ్చంద్ర గుప్త ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్డులో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మూడోసారి మోదీని ప్రధానిగా గెలిపించాలని అన్నారు. దేశ అభివృద్ధి, పిల్ల భవిష్యత్ కోసం కేంద్రంలో బీజేపీ ఉండాలని అన్నారు. నాయకులు ఉడుగుల రమేష్, సొడ రమేష్, నర్సయ్య, సత్యం ఎల్లయ్య, శశిధర్, రవి, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

బచ్చన్నపేట: దేశాభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, మూడోసారి ప్రధాని నరేంద్రమోదీ అవడం ఖాయమని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చిమ్ముల నరేందర్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై గ్రామాల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల శాఖ అధ్యక్షుడు గుండు శ్రీను, సీనియర్ నాయకులు సీతారాములు, బూత్ అధ్యక్షులు నర్సయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావాలని, నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాలనే సంకల్పంతో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. పార్టీ మండల శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ తాళ్లపెల్లి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఘన్‌పూర్‌లో ఇంటింటా కేంద్రంలో మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. గోనెల శ్రీనివాస్, శ్రీధర్, తిరుపతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

బచ్చన్నపేట: అంగన్‌వాడీలో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. లక్ష్మాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆహార పదార్థాలను, కోడిగుడ్లు, రికార్డులను పరిశీలించి టీచర్‌కు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, పంచాయతి కార్యదర్శి ప్రశాంతాచారి ఉన్నారు.

ధాన్యం రోడ్లపై ఆరబోయొద్దు

పాలకుర్తి: రైతులు పండించిన ధాన్యాన్ని అమ్మకం కోసం ప్రధాన రోడ్లపై ఆరబోయొద్దని ఎస్సై సాయి ప్రసన్న కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రోడ్లపై వరి ధాన్యాన్ని పోయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. ఎవరు కూడా రోడ్డుపై ధాన్యం ఆరబోయవద్దని తెలిపారు. ధాన్యం కారణంగా ఏదైనా ప్రమాదం జరిగితే సంబంధిత రైతుపై చట్టపరమైన చర్య తీసుకోవడం జరుగుతుందన్నారు.

'బల్మూరి'ని కలిసిన యువజన నాయకులు

దేవరుప్పుల: వరంగల్‌లో తలపెట్టిన పార్లమెంటరీ ముఖ్య సమావేశానికి మండలం నుంచి మంగళవారం విద్యార్థి, యువజన నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఉప్పుల ప్రకాష్, చింత ఉపేందర్, సోమశేఖర్, ఉప్పుల సిద్దు,కందుకూరి సాయి, కార్తీక్, పవన్, ముకేశ్, అఖి, మనోజ్ ఉన్నారు.

'సీపీఎం అభ్యర్థిని గెలిపించండి'

జనగామ రూరల్: నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేసే సీపీఎం అభ్యర్థినే భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు కోరారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ, గురుద్వార్ లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. చందు, రజిత, లింగం, వెంకటమల్లయ్య, జయ పాల్గొన్నారు

అవగాహన

పాలకుర్తి టౌన్: జాతీయ అగ్నిమాపక భద్రతా వారోత్సవాల సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో పాలకుర్తి అగ్నిమాపక కేంద్ర అధికారి సీహెచ్ శ్రీరాములు ఆధ్వర్యంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ ద్వారా అగ్ని ప్రమాద నివారణ, భద్రత చర్యలు ప్రజలకు వివరించారు. చిన్నపిల్లలను స్టౌవ్‌కు సిలిండర్‌కు దూరంగా ఉంచాలన్నారు. ప్రధాన అగ్నిమాపకులు పి. కిరణ్‌కుమార్, శ్యాం సుందర్, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు


జనగామ రూరల్: మండలంలోని పెద్దపహాడ్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై డ్రంకెన్ డ్రైవ్‌లో ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానాను జనగామ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట రాంనర్సయ్య విధించినట్లు పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్సపొందుతున్న ఇద్దరి మృతి


భిక్షపతి (ఫైల్)

రఘునాథపల్లి: మాధారం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బూరుగు భిక్షపతి (59) ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలతో హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బూరుగు భిక్షపతిగౌడ్ ఈ నెల 15న రోజువారిగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన భిక్షపతిని స్థానికులు జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రంబోజీగూడెంలో..


అంజయ్య (ఫైల్)

దేవరుప్పుల: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై ఎన్ చెన్నకేశవులు కథనం ప్రకారం.. రంబోజీగూడెం గ్రామ పంచాయతీ పరిధి రాజీవ్‌నగర్‌కు చెందిన గీత కార్మికుడు రాంపెల్లి అంజయ్య (58) భార్య యాదలక్ష్మీతో కలిసి ఈ నెల 12వ తేదీన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై జనగామ నుంచి అప్పిరెడ్డిపల్లె మీదుగా స్వగ్రామానికి వస్తున్నాడు. వెనుకాల వస్తున్న టాటాఏస్ డ్రైవర్.. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దరిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అంజయ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

రోడ్డు పక్కన వృద్ధుడి..

కొడకండ్ల: రోడ్డు పక్కన వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మొండ్రాయి శివారులో చోటు చేసుకొంది. ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా నాగారం మండలం పణిగిరికి చెందిన సంగం సుందరయ్య(62) రోడ్డు పక్కన చెత్త కాగితాలు, వాటర్ బాటిళ్లు ఏరుకొంటూ మండలంలోని మొండ్రాయి శివారులో సోమవారం రోడ్డు పక్కన పడి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసి శవ పంచనామా నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వడ దెబ్బకు గురై మృతిచెందాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అన్నదానం



జనగామ: పట్టణంలోని పాతబీటు బజారులో శ్రీరామనవమి పందిరి మండపం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు న్వహించారు. 7వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఐత శ్రీకాంత్, సోమనువంతరావు, బచ్చు అశోక్, నందు బజాజ్, బుస్స పాండు, ద్వారకదాసు బజాజ్, రామిని శ్రీధర్, కందుకూరు శ్రీనివాస్, హరిప్ర సాద్, లోహియా, సత్తు, ఎర్రం ప్రసాద్, పబ్బ నాగయ్య, శివరామకృష్ణ, వంగ పల్లి చంద్రశేఖర్, శ్రీకాంత్, కందుకూరి ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవలకు సత్కారం


దేవరాజ్‌ను అభినందిస్తున్న ఇందిర

రఘునాథపల్లి: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామానికి చెందిన శాగ దేవరాజ్ తన తల్లిదండ్రులు స్వర్గీయ శాగ సుజన-ధనప్రకాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 143 మంది దహన సంస్కారాలకు కలప సాయం అందించి దాతృత్వం చాటారు. సేవలను గుర్తించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర బుధవారం పార్టీ నాయకులతో కలిసి దేవరాజ్‌ను శాలువాతో సత్కరించి అభినంధించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె రమేష్, మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, గుగులోతు కొమురెల్లి, జీడికంటి రాజ్‌కుమార్, మేడిపల్లి వెంకటేశ్వర్లు, రంగు మురళి పాల్గొన్నారు.

'చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు కృషి'


మాట్లాడుతున్న మల్లేశం

జనగామ: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం కురుమ సంఘం కృషి చేస్తుందని జనగామ కురుమ సంఘం , బిల్డింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్దె మల్లేశం అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో యెంద్రు వైకుంఠం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్న ఘనత నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్‌దే అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీ పథకం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. కొమ్మూరి ప్రతాపరెడ్డి నాయకత్వంలో పార్టీ కోసం పని చేస్తామన్నారు. కార్యక్రమంలో కేడి శ్రీనివాస్, సిద్ధ రాములు, రామచందర్, పవన్ కళ్యాణ్, సాయికిరణ్, ప్రవీణ్, శ్రీను, ఉపేందర్, మైసయ్య, శ్రీనివాస్, సిద్ధులు, శ్రీశైలం, రాములు, మైసయ్య, కేశవులు, యాదగిరి, నర్సింహులు, సత్తయ్య, బాలయ్య, శ్రీను, కర్ర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు స్వర్ణ ప్రాశన


చిన్నారికి స్వర్ణ ప్రాశన వేస్తున్న అంజిరెడ్డి

జనగామ: జిల్లా కేంద్రం హైదరాబాద్‌రోడ్డులోని వేద ఆయుర్వేదిక్ పంచకర్మ వెల్‌నెస్ హాస్పిటల్‌లో పుష్యమి నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం డాక్టర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో 120 మంది పిల్లలకు ఉచితంగా స్వర్ణ ప్రాశన వేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ 0 నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలు స్వర్ణ ప్రాశన తీసుకోవడంతో జీర్ణశక్తి, ఎముకల పటిష్టత, చర్మకాంతి పెరుగుతుందని, అన్ని రకాల అలర్జీల నుంచి రక్షణ కవచంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ తనూజ, మౌనిక, హాస్పిటల్ సిబ్బంది అర్పిత, వెంకటేష్, సాయి, ఉదయ్, శివ తదితరులు ఉన్నారు.

వెన్నుపోటుదారుడు కడియం శ్రీహరి

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


అభివాదం చేస్తున్న నాయకులు

మడికొండ: కడియం శ్రీహరిని బీఆర్‌ఎస్ మంత్రిని చేసింది.. ఎంపీని చేసింది.. ఆయన బిడ్డకు ఎంపీ సీటు ఇస్తే.. తీరా పార్టీకి వెన్నుపోటు పొడిచి కాంగ్రెస్‌లో చేరాడని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం కాజీపేట మండలం మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ కడియం శ్రీహరికి సిగ్గు ఉంటే బీఆర్‌ఎస్ పెట్టిన భిక్ష మీద గెలిచిన ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సిగ్గు లేకుండా తన కుమార్తె కావ్యకు ఓటు వేయాలని ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఎలా తిరుగుతాడో చూస్తాననన్నారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ఉద్యమకారుడు, నీతి, నిజాయితీ కలిగిన సుధీర్‌కుమార్‌కు అవినీతి పరుడైన కడియం శ్రీహరికి మధ్య జరుగుతున్నాయన్నారు. తాను మనుమరాలి వయస్సున్న అమ్మాయి చేతిలో ఓడిపోయానని అనడానికి సిగ్గుండాలన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఇప్పుడు ఎన్నికల్లో ఏ విధంగా ఓట్లను అడుగుతారని ప్రశ్నించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఘన్‌పూర్ నియోజకవర్గానికి కడియం చేసిందేమీ లేదన్నారు. ఏడు రిజర్వాయర్లు తెచ్చింది రాజయ్య, రాజేశ్వర్‌రెడ్డి అని పేర్కొన్నారు. వంద పడకల ఆస్పత్రి మంజూరు చేయిస్తే నిలిపి వేసింది కడియం శ్రీహరి కాదా అని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఏనుగుల రాకేష్‌రెడ్డి, నియోజకవర్గంలోని ఏడు మండలాల అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజకీయ బ్లాక్ మెయిలర్ కడియం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటేష్


మాట్లాడుతున్న వెంకటేష్

స్టేషన్‌ఘన్‌పూర్: స్వార్థ, అవకాశవాద, బ్లాక్‌మెయిలింగ్, వెన్నుపోటు రాజకీయాలకు కడియం శ్రీహరి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను కడియం మోసపూరిత మాటలు నమ్మి బీఆర్‌ఎస్‌లోకి వెళ్లానని, బీఆర్‌ఎస్ పార్టీలో గెలిచి ఎవ్వరికీ చెప్పకుండా స్వార్థ రాజకీయాలతో, కుమార్తెకు టికెట్‌కోసం కాంగ్రెస్‌లోకి వెళ్లడం సిగ్గుచేటన్నారు. దీంతో సొంత బీజేపీలోకి వచ్చానని, దేశాన్ని విశ్వగురువును చేయడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారన్నారు. బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేష్‌పై కడియం వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని, శ్రీహరి ఎమ్మెల్యే కాకముందే ఆరూరి కాంట్రాక్టర్‌గా ఉన్నారని గుర్తు చేశారు. త్వరలో కడియం అక్రమ ఆస్తులు బయటపెడతానని, లేనిపక్షంలో బస్టాండ్‌సెంటర్‌లో ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశారు. దేశంలో ప్రధాని మోదీకి రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గట్టు క్రిష్ణగౌడ్, కోరుకొప్పుల నాగేష్, బుర్ర తిరుపతి, వద్దుల తిరుపతి, సాయిరామ్, గాదెపాక శ్రీను, రాజు, తాళ్లపెల్లి శ్రీను, రడపాక శ్రీను, చెరిపెల్లి త్రిశూల్, సతీష్, సంపత్ పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి


దొడ్డిగుట్టపై రామచంద్రస్వామి ఆలయం


ఘన్‌పూర్‌లోని తిరుమలనాథస్వామి దేవాలయం


పంచలోహ విగ్రహాలు

రఘునాథపల్లి: రాములోరి కల్యాణానికి రఘునాథపల్లి శివారులోని దొడ్డిగుట్టపై అయోధ్యరామచంద్రస్వామి ఆలయం ముస్తాబైంది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ బొల్లం అజయ్, ఎంపీటీసీ పేర్ని ఉషారవి, మాజీ సర్పంచ్ పోకల శివకుమార్, గ్రామపెద్దలు, మాజీ వార్డు సభ్యులను ఆహ్వానించారు. వేడుకలను తిలకించేందుకు వచ్చే భక్తులకు బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పెద్ద ఎత్తున మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అశేష భక్త జనానికి అన్ని విధాలా సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

స్టేషన్‌ఘన్‌పూర్: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండలంలోని తాటికొండలోని ప్రసిద్ధ సీతారామచంద్రస్వామి దేవస్థానం, స్థానిక తిరుమలనాథస్వామి దేవస్థానం, శివునిపల్లి నగరేశ్వరాలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో దేవస్థానాల కమిటీలు, భక్తుల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. రాములోరి కల్యాణం సందర్భంగా గ్రామాల్లో ముస్తాబైన దేవాలయాలతో ఆధ్యాత్మిక శోభ కనిపిస్తుంది.

నేడు విగ్రహాల అందజేత

చిల్పూరు: మండలంలోని శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన బుక్క బాపురాజు నేడు(బుధవారం) సీతారాముల కల్యాణం సందర్భంగా సీతారామలక్ష్మణ హనుమంతుని పంచలోహ విగ్రహాలను అందజేయనున్నట్లు తెలిపారు. గ్రామ సమీపంలోని పాటిమీద నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయానికి ఈ విగ్రహాలను అందజేయడంతో పాటు కల్యాణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నవాబుపేటలో గరుడ ముద్ద



లింగాలఘణపురం: నవాబుపేట కోదండ రామస్వామి ఆలయంలో ఈ నెల 17న శ్రీరామ నవమి సందర్భంగా గరుడముద్ద కార్యక్రమాన్ని వేదపండితులు లక్ష్మీనర్సింహాచార్యులు చేపట్టారు. సీతారాముల కల్యాణం సందర్భంగా దేవతలను ఆహ్వానించే కార్యక్రమంలో గరుడముద్దను నిర్వహించగా భక్తులు ప్రసాదం కోసం భక్తిశ్రద్ధలతో పాల్గొనా హోమం కూడా నిర్వహించారు. అదే విధంగా జీడికల్ వీరాచాల రామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. నవాబుపేటలో ఈఓ లక్ష్మీప్రసన్న, సిబ్బంది మోహన్, వరలక్ష్మి, రమేష్, జీడికల్‌లో సీనియర్ అసిస్టెంట్ రాములు, సిబ్బంది ఉన్నారు.

ఓఆర్‌ఎస్ ద్రావణం తాగాలి



దేవరుప్పుల: ఎండల తీవ్రతతో అస్వస్థతకు గురయ్యే ప్రమాదాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ ఓఆర్‌ఎస్ ద్రావణం తాగితే బహుళ ప్రయోజనాలు కలుగుతాయని మండల వైద్యాధికారి రాజపురి రవితేజ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామం పంచాయతీ వద్ద ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వడదెబ్బ నుంచి రక్షించుకునే దిశలో ఓఆర్‌ఎస్ ప్రయోజనాలపై విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌ఎం వసంత, ఆశవర్కర్లు ఆర్ జ్యోతి, జి లక్ష్మీ, మాజీ వార్డు సభ్యులు బొందుగుల సోమయ్య, నర్ర సోమశేఖర్, సోమసుందర్, బొజ్జం యాకయ్య, బొందుగుల యాదయ్య, బండారి సాయిలు, దొంతరబోయిన సోమన్న పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం


కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలతో ఎంపీపీ సరిత

చిల్పూరు: గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు అన్నారు. మండల కేంద్రంలో వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న కడియం శ్రీహరితోనే గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలనే సంకల్పంతో ఉన్నామన్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు పనిచేస్తామని అన్నారు. మూల నాగరాజు, గనగోని రమేష్, నవీన్ పాల్గొన్నారు.